# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-02-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. ఆంధ్రప్రదేశ్‌లో సాంకేతికత అనుసంధానంతో చెల్లింపులు, పౌరసేవల్లో ఆటోమేషన్ పెంచాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

**2. తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న 23వ బయో ఏషియా 2026 అంతర్జాతీయ సదస్సును ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి ఈరోజు ప్రారంభిస్తారు.**

**3. ఆంధ్రప్రదేశ్ శాసన సభ, శాసన మండలి బడ్జెట్ సమావేశాలు రెండు రోజుల విరామం అనంతరం ఈ రోజు నుండి తిరిగి ప్రారంభం కానున్నాయి.**

**4. ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించామని కేంద్ర పౌర విమానయన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పాలనలో ప్రక్రియలు, నిబంధనలను మరింత సరళీకరించేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో రియల్ టైమ్ గవర్నెన్స్ ఆర్టీజీయస్ పై ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ,. ప్రభుత్వ సేవలు సులభంగా ప్రజలకు చేరేలా విధానాల్లో మార్పులు చేయాలని, ఈ అంశంపై అధ్యయనం కోసం కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు.సాంకేతికత అనుసంధానంతో చెల్లింపులు, పౌరసేవల్లో ఆటోమేషన్ పెంచాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు, అన్న క్యాంటీన్లు, విద్యార్థి హాస్టళ్లు, విజిబుల్ పోలీసింగ్ వంటి రంగాల్లో అత్యుత్తమ ప్రమాణాలు పాటించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

--------------------------

తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న 23వ బయో ఏషియా 2026 అంతర్జాతీయ సదస్సును ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి ఈ రోజు ప్రారంభిస్తారు. హైదరాబాద్ హైటెక్స్‌లో జరిగే బయోఏషియా-2026 సదస్సు రెండు రోజుల పాటు జరుగనుంది. ఈ ప్రపంచ స్థాయి సదస్సు ప్రధానంగా 'టెక్‌బయో అన్‌లీష్డ్ - ఏఐ, ఆటోమేషన్, జీవశాస్త్ర రంగంలో వస్తున్న విప్లవాత్మక పరిణామాలు' ఇతివృత్తంగా నిర్వహిస్తున్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞాన వినియోగంతో లైఫ్ సైన్సెస్ రంగంలో భవిష్యత్ ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన అంశాలపై ఈ

సదస్సు చర్చించనుంది. లైఫ్ సైన్సెస్ రంగంలో ప్రఖ్యాత సంస్థలు ఏర్పాటు చేసే అంతర్జాతీయ ప్రదర్శనను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నంలో అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ -- ఐఎఫ్ ఆర్, మిలాన్-2026 కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ లో పాల్గొనేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు సాయంత్రం విశాఖపట్టణానికి చేరుకుంటారు. రేపు ఉదయం రాష్ట్రపతి ఫ్లీట్ రివ్యూ లో పాల్గొంటారని అధికారులు తెలిపారు. ఫ్లీట్ రివ్యూ కార్యక్రమంలో పాల్గొనేందుకు నిన్న విశాఖపట్నం చేరుకున్న రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌కు జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్, నగర పోలీసు కమిషనర్ శంఖ బ్రత బాగ్చీ, నౌకాదళ అధికారులు స్వాగతం పలికారు. ఐఎఫ్ఆర్- 2026 ముందస్తు రిహార్సల్స్ లో భాగంగా విశాఖ సాగరతీరంలో నిన్న సాయంత్రం నిర్వహించిన విన్యాసాలు ప్రజలను ఆకట్టుకున్నాయి.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పాఠశాల స్థాయి నుంచే క్రీడా ప్రతిభను వెలికితీయాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ 'శాప్ లీగ్'లో భాగంగా రాష్ట్ర స్థాయి చెస్ లీగ్ ఈ నెల 21న తిరుపతిలో ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా విజయవాడలో జరిగిన కార్యక్రమంలో క్రీడాపాధికార సంస్థ వీసీ, ఎండీ బి. భరణి, ప్రముఖ క్రీడాకారిణులు కోనేరు హంపి, పీవీ సింధు లీగ్ ట్రోఫీ, మస్కట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీవీ సింధు మాట్లాడుతూ... రాష్ట్రంలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడానికి ఈ లీగ్ ఒక ముఖ్య వేదికగా నిలుస్తుందని పేర్కొంటూ...

వాయిస్..25 సెకన్లు

అంతకు ముందు కోనేరు హంపి మాట్లాడుతూ...

వాయిస్..30 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ శాసన సభ , శాసన మండలి బడ్జెట్ సమావేశాలు రెండు రోజుల విరామం అనంతరం ఈరోజు నుండి తిరిగి ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా ఈ నెల 14 వ తేదీన ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన 2026 - 27 వార్షిక బడ్జెట్ పై ఈరోజు, రేపు చర్చ జరుగుతుంది. బడ్జెట్ పై జరిగే చర్చకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ రేపు సమాధానం ఇస్తారు. ఈ వారంలో శాసనసభ పలు ప్రధాన బిల్లులను ఆమోదించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిన్న సమావేశమయ్యారు. అమరావతిలో జరిగిన ఈ సమావేశంలో రెండు రాష్ట్రాల మధ్య సమన్వయం, సహకారంతో పరిష్కరించాల్సిన పలు అంశాలపై చర్చించారు. సరిహద్దు ప్రాంతాల్లో రోడ్లు, సాగునీటి ప్రాజెక్టులు, రైల్వే లైన్లు వంటి అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేస్తే తెలుగు రాష్ట్రాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని తుమ్మల నాగేశ్వరరావు అభిప్రాయపడ్డారు. రెండు ప్రభుత్వాల మధ్య ఉన్నత స్థాయి సంప్రదింపుల ద్వారా సమస్యలకు

పరిష్కారం లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

---------------------------

ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించామని కేంద్ర పౌర విమానయన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. శ్రీకాకుళంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించి అర్జీదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత శాఖల అధికారులకు ఫోన్ చేసి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. సుమారు 1,500 మంది నుంచి అర్జీలు అందాయని కేంద్ర మంత్రి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని శ్రీశైల మహా క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజైన నిన్న సాయంత్రం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు రథోత్సవం నిర్వహించారు. అలాగే విజయవాడలో శ్రీ గంగా పార్వతీ సమేత దుర్గామల్లేశ్వర స్వామివార్లకు రథోత్సవం నిర్వహించారు. అనంతరం రథంపై విహరిస్తూ స్వామి, అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. రథోత్సవాన్ని తిలకించేందుకు వేలాదిగా భక్తజనం తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న దుర్గగుడి పాలకమండలి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ,

వాయిస్..30 సెకన్లు

---------------------------

తెలంగాణలో పట్టణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం ప్యూర్, క్యూర్, రేర్ మూడు జోన్ల అభివృద్ధి నమూనాతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మం జిల్లా మధిరలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సమష్టిగా పనిచేస్తూ ఒకవైపు అభివృద్ధిని.. మరోవైపు సంక్షేమాన్ని అమలు చేస్తోందన్నారు. పారదర్శక పాలన, అభివృద్ధి పనులు వంటి అంశాలే మున్సిపల్ ఎన్నికల విజయానికి కారణమని తెలిపారు.

---------------------------

హిందూ మహాసముద్రం, దక్షిణమధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని, దీని ప్రభావంతో అల్పపీడనం ఏర్పడిందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ అల్పపీడనం పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ.. మరింత బలపడే అవకాశముందని పేర్కొంది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. తెలంగాణాలోనూ స్వల్ప వర్షపాతం నమోదయ్యే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 131వ సంచిక ఈనెల 22వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు 20వ తేదీ వరకు పంపవచ్చు.

=====================